క్లుప్తంగా

బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం

మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని మంత్రి వాకిటి శ్రీహరి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు ఇళ్లు మంజూరు



మక్తల్: ఇందిరమ్మ రాజ్యంలో పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్ అన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ మండలం పారేవుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లబ్ధిదారులు రేషన్ కార్డులను పేదలకు మార్కెట్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్, కార్యదర్శి శ్రీపాద, మాజీ సర్పంచు మణివర్ధన్, రవీందర్‌రెడ్డి, కలిక ఆంజనేయులు, రాజేందర్‌రెడ్డి, తిరుమలేష్, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

మాగనూర్: ఈ నెల 12న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రాకేశ్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మాగనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అండర్ –14, అండర్ –17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. వివరాలకు సెల్: 9010096659ను సంప్రదించాలని కోరారు.

సీఆర్‌పీలకు ఘన సన్మానం



ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో మంగళవారం సీఆర్‌పీలు రాజశేఖర్‌గౌడ్, భీమన్న, మహేష్‌గౌడ్ లకు శాలువా, పూలమాలలతో లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ గౌరమ్మ, వెంకట్‌రెడ్డి, వెంకటరాములు, రామచంద్రయ్య, సత్యపాల్, పృథ్వీ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి



మక్తల్: మండలంలో జక్లేర్ స్టేజీ దగ్గర కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసేందుకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం చేయాల ని కోరారు. అనంతరం రూ.5 లక్షలు అందజేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రికి పూల మొక్కను, వాసవి మాత చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో కట్ట సురేష్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, నరేందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంగళవారం మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు తదితర గ్రామాలకు చెందిన పదిమంది లబ్ధిదారులకు రూ.4.32 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యజ్ఞేశ్వర్ రెడ్డి, బాలరాజు, రవి, అర్జున్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపేందుకు గ్రీన్‌సిగ్నల్

- ఐదేళ్ల కృష్ణా మండల ప్రజల పోరాటం ఫలితం
- ఎట్టకేలకు సమ్మతం తెలిపిన కేంద్ర రైల్వేశాఖ



కృష్ణా రైల్వేస్టేషన్.

కృష్ణా: కృష్ణారైల్వే స్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు కేంద్ర రైల్వేశాఖ నుంచి ఎట్టకేలకు అంగీకారం రావడంతో మండల ప్రజలు, బీజేపీ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. దీని కోసం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కృషి ఫలితంగానే ఈ రోజు రైళ్లు నిలిపేందుకు కేంద్ర రైల్వేశాఖ సమ్మతించిందని నాయకులు తెలిపారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు అవిశ్రాంతంగా కృషి చేయడం వల్లనే ఈ రోజు ఫలితం చూస్తున్నామన్నారు. ఎట్టకేలకు రైళ్లు నిలపడం ద్వారా కృష్ణాకు పూర్వవైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైళ్లు నిలపడం మూలంగా ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణించుటకు అవకాశం ఏర్పడి వ్యాపారులు, ఆటో కార్మికులకు మేలు కలుగుతుంది. కృష్ణానదిలో పిండప్రదానం చేయడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇక్కడి అర్చకులకు కూడా మేలు జరుగనుంది. ప్రధానంగా కృష్ణా స్టేషన్‌లో 1 కొయంబత్తూర్ లోకమాన్య తిలక్, 2 చెన్నై, ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రతి రోజు ఈ స్టేషన్‌లో నిలవనున్నాయి. అలాగే వారంలో ఒక్కమారు వచ్చే ముంబాయి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఇక్కడ నిలపనున్నారు.

గ్రామస్తుల ఐదేళ్ల అవిశ్రాంత పోరాటం

మండల కేంద్రంలోని కృష్ణా రైల్వే స్టేషన్‌లో 2020 కరోన కారణంగా అప్పటి ప్రభుత్వం కృష్ణా రైల్వే స్టేషన్‌లో నిలిపే రైళ్లను రద్దు చేసింది. ఆ తరువాత రైల్వే శాఖ రైళ్లను పునరుద్ధరించినా ఈ కృష్ణా స్టేషన్‌లో మాత్రం ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు అనుమతి ఇవ్వలేదు. ఈ విషయంపై గత ఐదేళ్లుగా గ్రామ నాయకులు నిరసనలు, ధర్నాలు, అధికారులకు, నాయకులు, కేంద్ర మంత్రులకు వినతులు, ఇలా పలురకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. చివరకు బీజేపీకి ఆ పార్టీ నాయకులు రాజీనామాలు చేశారు. ఐన కేంద్ర ప్రభుత్వం కాని, రైల్వేశాఖ అధికారులు కానీ స్పందించలేదు. తీరా ఎంపీగా మహ బూబ్‌నగర్ నుంచి డీకే అరుణ ఎన్నికవడంతో ఈ విషయంపై కొంత చలనం కనిపించింది. పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రికి డీకే అరుణ విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు ఈ నిర్ణయం వెలువడింది. దీంతో ఇక మీదట కృష్ణా గ్రామానికి పూ ర్వవైభవం సంతరించుకోనుందని చెప్పవచ్చు. ఇందుకు కృషి చేసిన ఎంపీ డీకే అరుణమ్మకు కృతజ్ఞతలు తెలిపేందుకు గురువారం రైల్వే స్టేషన్‌లో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప, జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్‌లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మరికల్: బ్యాంకు వినియోగదారులు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ అనుప్ అన్నారు. మరికల్ ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ముఖ్యంగా ప్రతి ఒక్కరు అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. కనీస అక్షరాస్యత ఉంటేనే సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న జీవన్ జ్యోతి, అటల్ బీమా యోజన వంటి పథకాలను బ్యాంకు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేష్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రంజిత్, జగదీశ్, నరేష్, శివ, సందీప్‌లు పాల్గొన్నారు.

మక్తల్‌లో ఐదు బైకులు చోరీ

మక్తల్: గుర్తుతెలియని వ్యక్తులు మక్తల్‌లో బైకులను మంగళవారం అర్ధరాత్రి చోరీ చేసిన సంఘటన చోటుచేసుకుంది. మక్తల్ సంగంబండ రోడ్డు వెళ్లే రహదారిలో ఉన్న కాలనీలో ఇళ్ల ముందు లాక్‌లు చేసిన ఐదు బైక్‌లను తీసుకెళ్లారు. సంగంబండ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులవి, భైరంపల్లికి చెందిన ఒకరిది, మక్తల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల బైకులు పోయినట్లు మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

లో ఓల్టేజీ సమస్యకు చెక్



కోస్గి రూరల్: కొంత కాలంగా పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను తీర్చామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బసవన్నగుడి, వేద ఉన్నత పాఠశాల సమీపంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించామన్నారు. దీంతో మున్సిపాలిటీలోని 11,12,13 వార్డులలో సమస్య తీరిందన్నారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జురాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, రాస్నం బాల్‌రాజ్, నాగులపల్లి శ్రీనివాస్, సోమశేఖర్, విద్యుత్ అధికారులు విజయ్‌కుమార్ ఉన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



మరికల్: ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక కావడంతో మండలంలోని అప్పంపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు బుధవారం సంబరాలు నిర్వహించారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుపతయ్య, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భవసార్ క్షత్రియ సమాజ్ కార్యవర్గం ఎన్నిక

కోస్గి రూరల్: భవసార్ క్షత్రియ రంగ్రెజ్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు అనిల్‌కుమార్ కాలేకర్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పతంగే, కోశాధికారి రాంకోటి, కార్యదర్శి నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శి సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం అభివృద్ధికి తోడ్పడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రవి, అంబదాస్, సతీష్, వసంత్, ఉన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



నర్వలో బీజేపీ నిర్వహించిన మహాధర్నా సందర్భంగా ర్యాలీ చేస్తున్న నాయకులు

నర్వ: ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల అమల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్వలో రైతులకు సన్నవడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం ఇవ్వనందుకు నిరసనగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. అనంతరం ధర్నాలో ప్లేకార్డులను ప్రదర్శిస్తూ 420 హామీల అబద్ధాల పునాదులపై ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందన్నారు. నిర్లక్ష్యం చేస్తే రాబో యే స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

ప్రధాని, ఆర్థికమంత్రి, ఎంపీకి పాలాభిషేకం

జీఎస్టీలో భారీగా తగ్గింపు చేపట్టి సామాన్య ప్రజలకు ఊరట కల్పించిన ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్, ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి, నాయకులు జగన్నాథం, వెంకటేశ్వర్‌రావు, విజయ్‌రామ్, యాదవరెడ్డి, రాంపూర్ నర్సింహ, పెద్దింటి ఆంజనేయులు, నీరజ్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



మద్దూరులో మీ సేవా కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న ఈడీఎం విజయ్‌కుమార్

మద్దూరు: మీ సేవా కేంద్రాలు ప్రభుత్వ నిబంధలను అతిక్రమించి దరఖాస్తు దారుల నుంచి అధిక రుసుం వసూలు చేస్తే ఆ కేంద్రాలపై చర్యలు తప్పవని మీసేవా ఈడీఎం(ఎలక్ట్రానిక్ టెక్నికల్ జిల్లా మేనేజర్) విజయ్‌కుమార్ నిర్వహకులను హెచ్చరించారు. బుధవారం మద్దూరు పట్టణంలోని మీ సేవా కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేంద్రాల్లో పౌర సేవాలపై అక్కడికి వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడారు. ప్రతి మీ సేవా కేంద్రాల్లో పౌర సేవల చార్జీలు ప్రదర్శించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం జారీ చేస్తున్న మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఎక్కడైతే మీ సేవా కేంద్రాలు మంజూరయ్యాయో అక్కడే కేంద్రాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రామ్మోహన్, మీసేవా నిర్వహకులు కంగ్రోద్దీన్, రామ్‌గోవిందు, కాశీ, గంగాధర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో 8 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈఓ నిజముద్దీన్ మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులు నాగరాజు- కృష్ణా, కుర్మన్న- ముడుమాల్, రేణుక -కృష్ణా, శరణప్ప- హిందుపూర్, ఎండీ కాశీం అలీ-కున్సీ, శ్రీనివాసులు- గుడెబల్లూర్, పద్మ సీఆర్‌టీ కేజీబీవీ -హిందుపూర్, కల్యాణి -గుడెబల్లూర్ పాఠశాలలకు చెందిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కొత్తపల్లి: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. కొత్తపల్లి మండలంలోని దుప్పడి గట్టు ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడు బి.మోహన్‌రెడ్డి, జే.రాజు, భూనీడు హెచ్‌ఎం నీలిమను ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేశ్, వెంకట్‌రాములు, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

నారాయణపేట టౌన్: పట్టణంలోని పలు వార్డులలో ఉదయం మున్సిపల్ కమిషనర్ నర్సయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం ఉదయం పలు వార్డులను, ప్రధాన రహదారులను సందర్శించి మున్సిపల్ కార్మికుల పనితీరును పరిశీలించి వారికి తగిన సూచనలు చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులను తూచా తప్పకుండా శుభ్రంగా ఉంచాలని, అదే విధంగా పలు వార్డులలో చెత్తా, మురికి కాలువలు పేరుకుపోకుండా చూడాలన్నారు. పట్టణంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు.

తెలంగాణ వీరనారి ఐలమ్మ



నారాయణపేటలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు



కోస్గిలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నర్వలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ వీర వనిత, సాయుధ తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని జిల్లాలోని పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, సంఘాల ఆఫీసుల్లో, ప్రధాన కూడళ్లలో ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారుల, వివిధ రాజకీయ పార్టీల, సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

- నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్థానిక చౌక్ బజార్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మద్దూరులో సీపీఎం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- మాగనూర్‌లో రజక సంఘం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్టాండ్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు.
- నర్వలో ఐలమ్మ కాంస్య విగ్రహానికి ఆయా కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఊట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ధన్వాడ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మచిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- మరికల్ మండలంలోని ఎలిగండ్లలో రజక సంఘం నాయకులు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- కోస్గి స్థానిక శివాజీ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నినాదాలు చేశారు.
- కొత్తపల్లి–కొడంగల్ నియోజక వర్గం కొత్తపల్లి మండల కేంద్రంలో భూమికా ఉమెన్స్ కలెక్టివ్ వలంటీర్ నరేశ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.
- కృష్ణా మండలం హిందుపూర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దామరగిద్దలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దామరగిద్ద, ఉడ్మల్‌గిద్ద, అయ్యవారిపల్లి లోకుర్తి, క్యాతన్‌పల్లి గ్రామాల్లో నివాళులర్పించారు.

విద్యార్థులకు చెస్‌బోర్డుల ప్రదానం



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కంప్లెక్స్ సమావేశంలో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం చెస్ బోర్డులు తహసీల్దార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుపతయ్య, ఎంఈఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలకు 211 చెస్ బోర్డులను పంపిణీ చేస్తున్నందుకు ఫోరం నిర్వహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎస్‌ఐ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వైఆర్జీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. సంస్థ డీయార్పీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్క వ్యక్తి వారి హెచ్‌ఐవీ స్థితిని కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. ఇక ఎయిడ్స్ సోకడానికి కారణాలు వివరించి నివారణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, భారతి, టీచర్లు భాను ప్రకాష్, నిర్మల, నర్సింహులు, డాక్టర్ శృతి, ఏఎస్‌ఎం అరుణ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ కేజీబీవీలో ఫుడ్‌సేఫ్టీ అధికారిని శ్రీలత తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు కిచన్, స్టోర్‌లో విద్యార్థులకు అందిస్తున్న వస్తువులలో నాణ్యతను పరిశీలించారు. భోజనం విషయంలో నాణ్యతా, ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రచురణ



ధన్వాడ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రచురించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



దామరగిద్ద: రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షలకు పైగా ఇచ్చి రైతులకు న్యాయం చేయాలని కాన్‌కుర్తి భూ నిర్వాసిత కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ తిరుపతయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తి భూ నిర్వాసిత రైతులకు సాధ్యమైనంత వరకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ధన్వాడ: వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం వెనుకబడ్డ వారిని ముందుకు తీసుకరావడానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు.

ప్రమాదకరంగా రహదారి



ప్రమాదకరంగా కోతకు గురైన రోడ్డు

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం గ్రామం నుంచి కోల్పూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా రోడ్డు కోతకు గురైందని ప్రయాణికులు తెలిపారు. ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయని, రోడ్డు కోతతో అందులో వాహనాలు పడిపోయి పెను ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయని. సగం వరకు రోడ్డు కోతకు గురికావడంతో వాటి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఇంతలా రోడ్డు కోతకు గురైనా కనీసం అక్కడ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.